RNI.No. APTEL/2014/57702

Estd.: 2000

www.voodayam.com /voodayam /Voodayam





# వుదయం

Simultaneously published from Guntur, Hyderabad, Adilabad, Khammam, Karimnagar & Warangal




సంపుటి : 10 ‖ సంచిక : 169 ‖ గుంటూరు ‖ సోమవారం, డిసెంబర్ 02, 2024 ‖ VOODAYAM Telugu Daily ‖ వెల : రూ. 1.00 ‖ పేజీలు : 12

## వక్ఫ్ బోర్డును రద్దు చేసిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం



అమరావతి డిసెంబర్ 1 : గత వైఎస్ఆర్ కాంగ్రెస్ హయాంలో నామినేట్ చేసిన రాష్ట్ర వక్ఫ్ బోర్డును చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రద్దు చేసింది. నవంబర్ 30 నాటి ఉత్తర్వులో, వైఎస్ఆర్ సి హయాంలో ఏర్పడిన ఏపి స్టేట్ వక్ఫ్ బోర్డు చాలా కాలంగా (మార్చి 2023 నుండి) పనిచేయడం లేదని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది.

అప్పట్లో ఏర్పడిన వక్ఫ్ బోర్డులో మొత్తం 11 మంది సభ్యులు ఉన్నారు, వీరిలో ముగ్గురు ఎన్నిక కాగా, మిగిలిన ఎనిమిది మంది నామినేట్ అయ్యారు. బోర్డు ఏర్పాటు విషయంలో అనుసరించిన విధానాన్ని సవాలు చేశాక, ఆంధ్రప్రదేశ్ హై కోర్టు 2023 నవంబర్ 1న వక్ఫ్ బోర్డు ఛైర్ పర్సన్ ఎన్నికపై స్టే విధించింది. ఆ ఉత్తర్వులో ఇలా ఉంది, "బోర్డు చాలా కాలంగా పనిచేయకపోవడం , వ్యాజ్యాలను పరిష్కరించడానికి జిఓఎంల నం. 47 యొక్క చట్టబద్ధతను సవాలుచేస్తూ రిట్ పిటిషన్లు పెండింగ్‌లో ఉండడాన్ని, పాలన పరమైన శూన్యాన్ని నివారించాలని కోరుతూ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్( ఎ.పి స్టేట్ వక్ఫ్ బోర్డ్, విజయవాడ) ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చారు". అన్ని అంశాలను , హైకోర్టు ఆదేశాలను జాగ్రత్తగా పరిశీలించిన తర్వాత, రాష్ట్ర ప్రభుత్వం "తక్షణ అమలు"తో అక్టోబర్ 21, 2023 తేదీ జివోని ఉపసంహరించుకున్నట్లు మైనారిటీ సంక్షేమ శాఖ తెలిపింది. మరోవైపు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వం వక్ఫ్ ఆస్తుల పరిరక్షణ, నిర్వహణ, మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు.

## ఏపీలో కొత్త రేషన్ కార్డులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో హామీ అమలుకు సిద్ధమైంది. 2024 ఏపీ ఎన్నికల సందర్భంగా తాము అధికారంలోకి రాగానే అర్హులైన వారికి కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తామని టీడీపీ కూటమి అప్పట్లో హామీ ఇచ్చింది. ఇక ఇచ్చిన మాట ప్రకారం ఏపీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు ప్రక్రియ మొదలెట్టనుంది. సంక్రాంతి కానుకగా కొత్త రేషన్ కార్డులు జారీ చేయనున్నారు. కొత్త రేషన్ కార్డుల కోసం డిసెంబర్ 2వ తేదీ నుంచి దరఖాస్తు స్వీకరణ మొదలుకానుంది. డిసెంబర్ 2 నుంచి డిసెంబర్ 28వ తేదీ వరకూ కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలకు రేషన్ కార్డులే ప్రామాణికం. పింఛన్ల దగ్గరి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం వరకూ రేషన్ కార్డులను ప్రామాణికంగా తీసుకుంటున్నారు.

అయితే కొత్త రేషన్ కార్డుల జారీ చాలా కాలంగా జరగకపోవటంతో అనేక మంది కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. ముఖ్యంగా కొత్తగా పెళ్లైన జంటలు, పిల్లలు కలిగిన దంపతులు, అలాగే మార్పులు, చేర్పుల కోసం ప్రభుత్వం ఎప్పుడు అవకాశం ఇస్తుందా అని ఎదురుచూస్తున్నారు. ఈ క్రమంలోనే ఏపీ సర్కారు కొత్త రేషన్ కార్డుల జారీకి అవకాశం కల్పించింది. కార్డుల విభజన, మార్పులు, చేర్పులకు అవకాశం కల్పించింది. అర్హులైనవారు తమ గ్రామ, వార్డు సచివాలయాల్లో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే ఏపీ పౌర సరఫరాల శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. డిసెంబర్ 28వ తేదీ వరకూ రేషన్ కార్డుల దరఖాస్తుకు అవకాశం కల్పించారు. దరఖాస్తుల స్వీకరణ పూర్తైన తర్వాత వారిలో అర్హులైన వారిని గుర్తించి సంక్రాంతి పండుగ లోపు గుర్తించి కొత్తరేషన్ కార్డులు జారీ చేస్తారు. కొత్తగా పెళ్లైన జంటలతో పాటు తల్లిదండ్రుల నుంచి విడిపోయిన వారికి కూడా కొత్తగా బియ్యం కార్డులు అందనున్నాయి. మరోవైపు కొత్త రేషన్ కార్డుల జారీపై ఇప్పటికే మార్గదర్శకాలు విడుదల చేసిన ఏపీ ప్రభుత్వం.. కార్యాచరణ రూపొందించాలని అన్ని జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది. కొత్త డిజైన్లతో, రాజముద్రతో కొత్త రేషన్ కార్డులు మంజూరు చేస్తారు. అధికారిక లెక్కల ప్రకారం సుమారుగా 1.50 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయనున్నట్లు సమాచారం. మరోవైపు డిసెంబర్ మూడో తేదీన ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. ఈ భేటీలో ఏపీలో కొత్త రేషన్ కార్డులు గురించి చర్చించే అవకాశాలు ఉన్నాయి.

## 3న ఏపీ కేబినెట్ భేటీ

### సంక్షేమ పథకాల విషయంలో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం..




ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు, పౌర సేవలతో, వివిధ కార్యక్రమాలపై ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయాలని నిర్ణయించింది. సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న తీరు, లోటుపాట్లపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని సీఎం నారా చంద్రబాబు నాయుడు నిర్ణయించారు. ఈ మేరకు అధికారులను ఆదేశించారు. ఐవీఆర్ఎస్ విధానం ద్వారా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించాలని నిర్ణయించారు. మెరుగైన సేవల కోసమే ప్రజాభిప్రాయ సేకరణ అని చెప్పిన నారా చంద్రబాబు నాయుడు.. ప్రభుత్వ విధానాల్లో ఏ అంశం గురించి అయినా ప్రజల నిర్ణయమే అంతిమంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ కూటమి సర్కారు అధికారంలో వచ్చిన తర్వాత సామాజిక భద్రత పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం, ఉచిత ఇసుక వంటి పథకాలను అమల్లోకి తెచ్చింది. అలాగే నూతన మద్యం విధానం సైతం తీసుకువచ్చింది. ఈ పథకాలపై ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని.. వారిచ్చే రేటింగ్ ఆధారంగా మార్పులు, చేర్పులు ఉంటే చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు భావిస్తున్నారు. అందుకోసమే ఐవీఆర్ఎస్ విధానం ద్వారా పథకాలపై ఫీడ్ బ్యాక్ తీసుకోవాలని నిర్ణయించారు. దీని ద్వారా ప్రజల్లో సంక్షేమ పథకాల అమలు గురించి ఎలాంటి అభిప్రాయం ఉందనే సంగతి తెలుస్తుంది. అలాగే ఇంకా మెరుగ్గా ఏమైనా చేయగలమా అనే విషయంలోనూ సూచనలు లభిస్తాయి. డిసెంబర్ 3న ఏపీ కేబినెట్ భేటీ

మరోవైపు ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం డిసెంబర్ 3వ తేదీ జరగనుంది. ముందుగా నిర్ణయించిన ప్రకారం డిసెంబర్ 4వ తేదీ ఏపీ కేబినెట్ భేటీ జరగాల్సి ఉంది. అయితే షెడ్యూల్‌లో మార్పులు చేశారు. ఒకరోజు ముందుగానే ఈ నెల మూడో తేదీన ఏపీ కేబినెట్ భేటీ జరగనుంది. మంత్రివర్గ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఎజెండా ఖరారు చేసేందుకు ఆదివారం సాయంత్రం 4 గంటలలోగా ప్రతిపాదనలు పంపాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ అన్ని శాఖల విభాగాధిపతులకు ఆదేశాలు జారీ చేశారు. మంత్రివర్గ సమావేశంలో కొత్త రేషన్‌కార్డుల జారీతో పాటు వివిధ అంశాలపై చర్చించే అవకాశం ఉంది. సూపర్ సిక్స్ పథకాల అమలు గురించి కూడా చర్చించనున్నట్లు సమాచారం.

## ఇక దేశ ఆర్థిక అభివృద్ధి ఉండబోదు



న్యూ డిల్లీ డిసెంబర్ 1 : భారత స్థూల జాతీయోత్పత్తి (జిడిపి) వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయికి పడిపోయి 5.4 శాతానికి చేరుకుందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆదివారం అన్నారు. రైతులు, కార్మికులు, మధ్యతరగతి, పేదలు ఆర్థికంగా అవస్థలు ఎదుర్కొంటుంటే, ప్రయోజనాలు కొంతమంది బిలియనీర్లకే పరిమితమైతే భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించబోదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "భారతదేశం స్థూల జాతీయోత్పత్తి వృద్ధి రేటు రెండేళ్ల కనిష్ఠ స్థాయికి, అంటే 5.4%కి పడిపోయింది. విషయమేమిటంటే భారత ఆర్థిక వ్యవస్థ కేవలం కొద్దిమంది బిలియనీర్లకు మాత్రమే ప్రయోజనాలు అందుతున్నంత కాలం రైతులు, కార్మికులు, మధ్యతరగతి మరియు పేదలు వివిధ ఆర్థిక సమస్యలతో పోరాడుతున్నంత కాలం భారత ఆర్థిక వ్యవస్థ పురోగమించదు" అని కాంగ్రెస్ నాయకుడు 'ఎక్స్' లో (ఇదివరకటి ట్విట్టర్) పోస్ట్ చేశారు. బంగాళదుంపలు, ఉల్లి ధరలు దాదాపు 50 శాతం పెరగడంతో రిటైల్ ద్రవ్యోల్బణం 6.21 శాతానికి పెరిగిందని, రూపాయి విలువ 84.50కి పడిపోయిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "ఈ వాస్తవాలను పరిశీలించండి, పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో గమనించండి: రిటైల్ ద్రవ్యోల్బణం 14 నెలల గరిష్ఠ స్థాయి 6.21 శాతంకి పెరిగింది. గతేడాది అక్టోబర్‌తో పోలిస్తే ఈ ఏడాది బంగాళదుంపలు, ఉల్లిపాయల ధరలు దాదాపు 50 శాతం పెరిగాయి. రూపాయి కనిష్ఠ స్థాయి 84.50కి చేరుకుంది. నిరుద్యోగం ఇప్పటికే 45 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టింది' అని రాహుల్ అన్నారు. గత ఐదేళ్లలో కూలీలు, ఉద్యోగులు, చిన్న వ్యాపారుల ఆదాయం స్తంభించిపోయింది లేదా గణనీయంగా తగ్గిందని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. "మొత్తం అమ్మకాలలో అందుబాటు ధరల గృహాల వాటా గత ఏడాది 38 శాతం నుండి 22 శాతానికి పడిపోయింది. ఎఫ్ఎంసిజి ఉత్పత్తులకు ఇప్పటికే డిమాండ్ తగ్గుతోంది. గత 10 ఏళ్లలో కార్పొరేట్ పన్ను వాటా 7 శాతం తగ్గగా, ఆదాయపు పన్ను 11 శాతం పెరిగింది. నోట్ల రద్దు, జిఎస్టీ కారణంగా ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగ వాటా 50 ఏళ్లలో కనిష్ఠంగా 13 శాతానికి పడిపోయింది. ఇటువంటి పరిస్థితిలో, కొత్త ఉద్యోగ అవకాశాలు ఎలా సృష్టించబడతాయి? "అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు.

## భక్తులకు ముఖ్యగమనిక

# శ్రీవారిమెట్టు మార్గం మూసివేత

ఫెంగల్ తుపాను ప్రభావంతో తిరుమలలో భారీ వర్షం కురుస్తోంది. గడిచిన 2 రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వర్షం కారణంగా తిరుమలలో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుమల శ్రీవారి దర్శనానికి వెళ్లిన భక్తులు వర్షం కారణంగా ఇబ్బందులు పడుతున్నారు. అయితే భారీ వర్షాల కారణంగా తిరుమలలోని జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. ఐదు ప్రధాన జలాశయాలు నిండుకుండలా మారాయి. తిరుమలలోని పాపవినాశనం, ఆకాశగంగ, గోగర్భం, కుమారధార, పసుపుధార జలాశయాలు జలకళను సంతరించుకున్నాయి. గోగర్భం డ్యామ్ పూర్తిగా నిండిపోయింది. దీంతో అధికారులు గేట్లను తెరిచి నీటిని దిగువకు విడుదల చేశారు. ప్రస్తుతం ఈ ఐదు జలాశయాల్లో ఉన్న నీరు.. తిరుమలకు 200 రోజుల తాగునీటి అవసరాలకు సరిపోతుందని అధికారులు చెప్తున్నారు. జలకళను సంతరించుకున్న జలాశయాలకు టీటీడీ సిబ్బంది ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల సమయానికి పాపవినాశనం డ్యామ్‌లో నీటిమట్టం 694.25 మీ.. ఎఫ్ఆర్ఎల్ 697.14 మీటర్లుగా ఉంది. అలాగే గోగర్భం డ్యామ్‌లో నీటిమట్టం 2894.00 అడుగులుగా.. %ఖీ=ా% 2894.00 అడుగులుగా ఉంది. ఆకాశగంగ డ్యామ్ పూర్తి రిజర్వాయర్ లెవల్ 865 మీటర్లు కాగా.. ఆదివారం మధ్యాహ్నం రెండు గంటల సమయానికి నీటిమట్టం 857.85 మీటర్లుగా ఉంది. కుమారధార డ్యామ్‌లో పూర్తి రిజర్వాయర్ సామర్థ్యం 898.24 మీటర్లు కాగా.. నీటిమట్టం 891.00 మీటర్లకు చేరుకుంది. పసుపుధార డ్యామ్ పూర్తి రిజర్వాయర్ సామర్థ్యం 898.24 మీటర్లు కాగా.. 896.40 మీటర్లకు చేరుకున్నట్లు అధికారులు వెల్లడించారు. కొన్ని నెలల కిందట ఆగస్టులో తిరుమల తాగునీటి అవసరాల కోసం నీటి కొరత ఏర్పడింది.




అయితే ఇప్పుడు జలాశయాలు పూర్తి జలకళను సంతరించుకోవటంతో తిరుమల తాగునీటి అవసరాలు మరో ఆరు నెలలపాటు ఢోకా లేనట్టే. మరోవైపు భారీ వర్షాలు, కొండచరియలు విరిగి పడుతున్న నేపథ్యంలో టీటీడీ అధికారులు ముందుజాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. పాపవినాశనం, శ్రీవారిమెట్టు మార్గాలను టీటీడీ అధికారులు తాత్కాలికంగా మూసివేశారు. అలాగే కొండపై నుంచి వరద ప్రవాహం అధికంగా ఉండటంతో తిరుపతి కపిలతీర్థంలోని పుష్కరిణిలోకి భక్తులను అనుమతించడం లేదు. అలాగే తిరుమల రెండో ఘాట్ రోడ్డులో కొండచరియలు విరిగిపడుతున్న నేపథ్యంలో అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విరిగిపడిన చెట్లు, బండరాళ్లు. కొండచరియలను తొలగించారు. అలాగే భక్తులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోవైపు తిరుమలలో గదులు దొరకని భక్తులు ఆరు బయటే సేదతీరుతున్నారు. టీటీడీ ఏర్పాటు చేసిన షెడ్లలో వేచి ఉంటున్నారు.

## గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ముఖ్య గమనిక

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు అలర్ట్.. హాజరు నమోదులో కీలక మార్పులు.. ఆ పొరబాటు చేయొద్దు

ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ముఖ్య గమనిక. గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేసే ఉద్యోగుల అటెండెన్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరును మొబైల్ యాప్‌లో తీసుకోనున్నారు. అటెండెన్స్ మొబైల్ యాప్ ఇప్పటికే అందుబాటులో ఉండగా.. ఇకపై రోజుకు రెండుసార్లు హాజరును నమోదు చేయాల్సి ఉంటుంది. వార్డు సచివాలయానికి వచ్చిన సమయంలో చెక్ ఇన్.. అలాగే విధులు ముగించుకుని తిరిగి వెళ్తున్న సమయంలో చెక్ అవుట్ నమోదు చేయాల్సి ఉంటుంది. సచివాలయానికి వచ్చిన సమయం.. అలాగే వెళ్లిన సమయం రెండింటినీ నమోదు చేయాలని గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందికి అధికారులు స్పష్టం చేశారు. అలాగే హాజరు నమోదు సమయంలో రెండింటిని ఒకేసారి నమోదు చేస్తే ఆరోజును సెలవుగా పరిగణిస్తామంటూ హెచ్చరించారు. ఈ విషయమై ఉద్యోగులకు సందేశాలు పంపించినట్లు తెలిసింది.

అయితే గతంలో గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హాజరు విధానం వేరే విధంగా ఉండేది. సచివాలయానికి వచ్చినప్పుడు లేదా.. వెళ్లేటప్పుడు ఒక్కసారి అటెండెన్స్ మొబైల్ యాప్‌లో హాజరు నమోదు చేసుకుంటే సరిపోయేది. అయితే ఈ విధానంలో కొన్ని అవకతవకలు జరుగుతున్నాయని గమనించిన అధికారులు.. ఇప్పుడు రెండు సమయాల్లోనూ హాజరు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. అలాకాకుండా ఒకేసారి నమోదు చేసినా, ఒకే ఎంట్రీ ఉన్నా కూడా ఆ రోజును సెలవుగా పరిగణిస్తామని తెలిపారు. దీంతో గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది క్రమం తప్పకుండా గుర్తుంచుకుని మరీ హాజరు వేయాలి. లేకపోతే పనిచేసినప్పటికీ ఆ రోజు సెలవుగా మారిపోతుంది మరి. మరోవైపు సామాజిక భద్రతా పింఛన్లను కూడా ఇప్పుడు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులే పంపిణీ చేస్తున్నారు. గతంలో వాలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ జరిగేది. అయితే టీడీపీ కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ విధానాన్ని మార్చింది. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది ద్వారానే ప్రతి నెలా ఒకటో తేదీన పింఛన్లు పంపిణీ చేయిస్తున్నారు. ఒకే రోజులో పింఛన్లను పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేశారు. మరోవైపు గ్రామాల్లోని సచివాలయాలను పంచాయితీలతో అనుసంధానం చేస్తారనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. మరి దీనిపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి.

